## క్లుప్తంగా

### గౌరీపట్నానికి పాదయాత్ర



మోకాళ్లపై కొండపైకి నడుస్తున్న విజయ్

కాజులూరు: సార్వత్రిక ఎన్నికలలో రామచంద్రపురం ఎమ్మెల్యే అభ్యర్థి పిల్లి సూర్యప్రకాశ్, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిల విజయం కోరుతూ గొల్లపాలెంకు చెందిన పార్టీ మండల యువజన విభాగ ప్రధాన కార్యదర్శి నిమ్మితి విజయ్ గౌరీపట్నం పాదయాత్ర చేపట్టారు. శనివారం సాయంత్రం గౌరీపట్నం చేరుకున్న విజయ్ మెట్లమార్గం ద్వారా మోకాళ్లపై నడుస్తూ కొండపైకి చేరుకుని మేరీమాతను దర్శించుకున్నారు. ఎమ్మెల్యే అభ్యర్థి పిల్లి సూర్యప్రకాశ్ విజయం సాధిస్తే రామచంద్రపురం ప్రజలు ప్రశాంతంగా శాంతియుత జీవనం గడపగలుగుతారన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలతో రాష్ట్రంలోని పేదలందరికీ ఎంతో మేలు జరుగుతుందని ఆయన మరోసారి ముఖ్యమంత్రి కావాల్సిన అవసరం ఎంతో ఉందన్నారు. అందుకే వారి ఇరువురి విజయం కోరుతూ గౌరీపట్నం మేరీ మాతకు మొక్కులు చెల్లించుకున్నానన్నారు.

### పంట కాలువలకు సాగునీరు విడుదల

కాజులూరు: ధవళేశ్వరం నుంచి గోదావరి తూర్పుడెల్టా కాలువకు ఇరిగేషన్ అధికారులు శనివారం సాగునీరు విడుదల చేశారని తొలకరి సాగుకు రైతులు చొరవ చూపాలని మండల వ్యవసాయాధికారి వి.అశోక్ అన్నారు. గొల్లపాలెం ఆయన రైతులతో మాట్లాడుతూ పంటకాలువల ద్వారా పోలాలకు మరో నాలుగు రోజులలో సాగునీరు చేరుతుందని రైతులు పంట దమ్ములకు సిద్ధం కావాలన్నారు. రైతులు సకాలంలో సాగుచేపట్టినట్లయితే పంట ప్రకృతి వైపరిత్యాల బారిన పడకుండా రక్షించుకోవచ్చన్నారు. రైతులు సాధ్యమైనంత త్వరగా తొలకరి పనులు ప్రారంభించాలన్నారు.

### మహిళా కళాశాలలో చేర్పించండి



పేరెన్స్ కమిటీతో మాట్లాడుతున్న హెచ్‌ఎం ఎస్ఎస్‌బి సుశీలమణి, తదితరులు

కాజులూరు: గొల్లపాలెంలో నూతనంగా మంజూరు చేసిన మహిళా జూనియర్ కళాశాలను స్థానికులు సద్వినియోగం చేసుకోవాలని స్థానిక హైస్కూల్ హెచ్‌ఎం ఎస్ఎస్‌బీ సుశీలమణి అన్నారు. శనివారం కళాశాలలో అధికారులు అడ్మిషన్లు ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన పేరెన్స్ కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడుతూ గొల్లపాలెం హైస్కూల్‌ను హైస్కూల్ ప్లస్‌గా అప్‌గ్రేడ్ చేస్తూ ప్రభుత్వం మహిళా జూనియర్ కళాశాలను మంజూరు చేసిందన్నారు. పట్టణాలలోని ప్రభుత్వ కళాశాలల మాదిరి ఈ నూతన కళాశాలలోనూ విద్యార్థులకు పూర్తిగా ఫీజు రాయితీతో పాటు పాఠ్యపుస్తకాలు ఇతర సామగ్రీ ప్రభుత్వం ఉచితంగా పంపిణీ చేస్తూ నాణ్యమైన విద్యను అందిస్తుందన్నారు. గొల్లపాలెం పరిసర గ్రామాలలో పదో తరగతి పాసైన బాలికలను వారి తల్లిదండ్రులు కళాశాలలో చేర్పించాలన్నారు. కార్యక్రమంలో స్టాఫ్ సెక్రటరి పి.సత్యనారాయణ, పీడీ సునీల్‌కుమార్, ఉపాధ్యాయులు వీవీఎస్ఎస్‌మూర్తి, సూర్యకుమారి, ప్రమీలా తదితరులు పాల్గొన్నారు.

### అనుమతులు లేకుండా మట్టి తవ్వకాలు



అంగర పోలీస్ స్టేషన్‌లో అదుపులో ఉన్న జేసీబీ

కపిలేశ్వరపురం: మండలంలోని పలు గ్రామాల్లో ప్రభుత్వం నుంచి ఎలాంటి అనుమతి లేకుండా వ్యవసాయ క్షేత్రాల్లోని మట్టి తవ్వకాలు జరుపుతున్నారు. మండలంలోనూ, సమీప ప్రాంతాల్లోనూ ఇటుక బట్టీలు విస్తారంగా ఉన్న నేపథ్యంలో మట్టికి డిమాండ్ ఎక్కువ. సొమ్ము చేసుకునేందుకు కొందరు అక్రమ మార్గాలను అనుసరిస్తూ రైతులకు పలు ఆశలు చూపి మట్టిని బట్టీలకు తరలిస్తున్నారు. దీనిలో ఆరితేరిన అక్రమార్కులు రాత్రింబవళ్లు తవ్వకాలు జరుపుతున్నారు. మండలంలోని టేకి, మాచర గ్రామాల్లో శుక్రవారం మట్టిని తరలిస్తుండగా రెవెన్యూ అధికారులు అప్రమత్తమై చర్యలు తీసుకున్నారు. టేకి వ్యవసాయ క్షేత్రంలోని మట్టిని తరలిస్తుండగా ఆర్ఐ శ్రీనివాసరావు ఆధ్వర్యంలోని రెవెన్యూ సిబ్బంది మట్టి ట్రాక్టర్‌ను, జేసీబీని అదుపులోకి తీసుకున్నారు. వాటిని అంగర పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఘటనపై నల్లూరుకు చెందిన పిల్లి వెంకటరమణ, టేకికి చెందిన సూరంపూడి వీవీ సత్యనారాయణలకు విచారిస్తున్నట్టు అధికారులు తెలిపారు. తవ్వకాలపై గనుల శాఖ అధికారులు సమాచారం ఇచ్చామన్నారు. ఇదిలా ఉండగా మాచరలో పెద్ద ఎత్తున వ్యవసాయ క్షేత్రాల్లో మట్టి తవ్వకాలు జరిగినట్టు సమాచారం.

# హై అలర్ట్



కార్డన్ సెర్చ్ సందర్భంగా ప్రజలకు అవగాహన కల్పిస్తున్న టౌన్ ఎస్ఐ హరికోటి శాస్త్రి(ఫైల్)

- కౌంటింగ్ నేపథ్యంలో పోలీస్ యంత్రాంగం అప్రమత్తం
- హింసాత్మక ఘటనలకు తావులేకుండా చర్యలు
- నియోజకవర్గం వ్యాప్తంగా కార్డన్ అండ్ సెర్చ్
- అమలులో 144 సెక్షన్, 30 పోలీస్ యాక్ట్

మండపేట: ఈ నెల నాలుగో తేదీన సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో పోలీస్ యంత్రాంగం అప్రమత్తమైంది. మండపేట నియోజకవర్గంలో హింసాత్మక ఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు చర్యలు చేపట్టింది. శాంతి భద్రతల పరిరక్షణ, నేర నియంత్రణకు విస్తృతంగా కార్డన్ అండ్ సెర్చ్‌లు నిర్వహిస్తోంది. బాణసంచా, లూజ్ పెట్రోల్ విక్రయాలపై నిషేధం విధించింది.

**ప్రత్యేక నిఘా**

నియోజకవర్గంలో పోలింగ్‌ను ప్రశాంత వాతావరణంలో నిర్వహించడంలో మండపేట అర్బన్, రూరల్ సీఐలు షేక్ అఖిల్‌జమ, కొమ్ముల శ్రీధర్‌కుమార్ సఫలీకృతమయ్యారు. పోలింగ్ అనంతరం కూటమి అల్లరి మూకల కవ్వింపు చర్యలతో వల్లూరులో శాంతిభద్రతలకు విఘాతం ఏర్పడిన సమయంలో వెంటనే అప్రమత్తమై పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. కౌంటింగ్ సందర్భంగా హింసాత్మక ఘటనలు చోటుచేసుకోకుండా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నియోజకవర్గంలోని టౌన్, రూరల్ సర్కిళ్ల పరిధిలో కట్టుదిట్టమైన భద్రత చర్యలు తీసుకున్నారు. తరచూ వివాదాలకు పాల్పడే వారిపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. పోలీస్ శాఖ ఆదేశాలను పెడచెవిన పెట్టి ప్రవర్తించే వారిపై అవసరమైతే రౌడీషీట్‌లు ఓపెన్ చేస్తామని టౌన్, రూరల్ సీఐలు హెచ్చరించారు.

**లూజ్ విక్రయాలు చేయకుండా..**

అరాచక శక్తులు పెట్రోల్ బాంబులు, పేలుడు స్వభావం కలిగిన బాణసంచా సామగ్రితో అల్లర్లు సృష్టించేందుకు ఆస్కారముండడంతో పెట్రోల్, డీజిల్‌ను బాటిళ్లలో లూజ్ విక్రయాలు చేయరాదని, నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఇప్పటికే పెట్రోల్ బంకుల యాజమాన్యాలకు నోటీసులు జారీ చేశారు. బాణసంచా విక్రయాలపై ఆంక్షలు విధిస్తూ తయారీదారులకు ఆదేశాలిచ్చారు.

**కార్డన్ అండ్ సెర్చ్‌లు**

కౌంటింగ్ సందర్భంగా అల్లర్లకు పాల్పడేందుకు ఇతర ప్రాంతానికి చెందిన పాతనేరస్తులు, రౌడీషీటర్స్ ఎవరైనా వచ్చి స్థానికంగా నివాసం ఉంటున్నారా?, హింసను ప్రేరేపించేలా ఆయుధాలు, కర్రలు ఇతర వస్తువులు ఎవరైనా కలిగి ఉన్నారా?, పెట్రోల్, డీజిల్, బాణసంచా తదితర వాటిని ఎవరైనా నిలువ ఉంచారా?, నేరాలకు పాల్పడడానికి పత్రాలు లేని వాహనాలను ఉన్నాయా? అనే అంశాలపై తనిఖీలు నిర్వహిస్తున్నారు. అలాంటి వారిని ముందుగానే గుర్తించి అవసరమైన చర్యలు చేపట్టేందుకు కొద్దిరోజులుగా కార్డన్ అండ్ సెర్చ్‌లు పేరిట పోలీస్ అధికారులు, సిబ్బంది, ప్రత్యేక బలగాలతో మండపేట పట్టణం, రూరల్, రాయవరం, కపిలేశ్వరపురం మండలాల్లోని సమస్యాత్మక ప్రాంతాలు, గ్రామాలను జల్లెడ పడుతున్నారు. అనుమానాస్పద వ్యక్తులను విచారించడంతో పాటు సక్రమంగా రికార్డుల్లేని వాహనాలను స్వాధీనం చేసుకుంటున్నారు. ఎస్ఐలు తమ స్టేషన్ల పరిధిలోని సమస్యాత్మక ప్రాంతాల్లో ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని కోరుతున్నారు.

**అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు**



"కౌంటింగ్ సందర్భంగా ఎవరైనా అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎక్కడా శాంతి భద్రతలు విఘాతం కలుగ కుండా అన్ని ఏర్పాట్లు చేశాం. అనుమానితులను గుర్తిస్తున్నాం. కార్డన్ సెర్చ్‌లు చేస్తున్నాం. ప్రజలు అవగాహనతో మెలగాలి. శాంతి భద్రతలకు విఘాతం కలిగించకుండా సంయమనం పాటించాలని ప్రజలందరినీ కోరుతున్నాం."

– షేక్ అఖిల్‌జమ, టౌన్ సీఐ

**విజయోత్సవ వేడుకలపై నిషేధం**

కౌంటింగ్ రోజు జిల్లా అంతటా 144 సెక్షన్, 30 పోలీస్ యాక్ట్ అమలు చేయనున్నారు. కౌంటింగ్ అనంతరం విజయోత్సవ వేడుకలపై నిషేధం విధించారు. ఎటువంటి ఊరేగింపులు, ర్యాలీలు చేయకూడదని, బాణసంచా కాల్చరాదని, ఎవరూ కూడా గుంపులుగా ఉండకూడదని పోలీస్ అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. అల్లర్లలో పాల్గొనే వారి వాహనాలు సైతం సీజ్ చేస్తామని, అల్లర్లకు ఉసిగొల్పేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తున్నారు.

### రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ప్రభంజనం ఖాయం



బత్తుల అప్పారావు

కె.గంగవరం: ఇటీవల జరిగిన ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ మళ్లీ అధికారంలోకి వస్తుందని ఆ పార్టీ నాయకులు, జిల్లా వ్యవసాయ సలహా కమిటీ సభ్యుడు బత్తుల అప్పారావు అన్నారు. మండల కేంద్రమైన కె.గంగవరంలో శనివార ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రతిపక్ష నేతలు అమలు కాని వాగ్దానాలు ఇచ్చి మళ్లీ ప్రజలను మోసం చేయాలని ప్రయత్నించారని కానీ ప్రజలు మాత్రం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి వెంట నిలిచారన్నారు. జూన్ 4న వెలువడే ఫలితాల్లో వైఎస్సార్ సీపీ ప్రభంజనం ఖాయమన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి గత ఐదేళ్ల పాలనలో ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేసి ప్రజల మనసుల్ని గెలిచారని మళ్లీ వచ్చే ఐదేళ్లలో అదే సంక్షేమ పాలన అందిస్తారన్నారు. రామచంద్రపురం నియోజకవర్గంలో కూడా వైఎస్సార్ సీపీ అభ్యర్థి పిల్లి సూర్యప్రకాష్ విజయం సాధిస్తారని ఆయన పేర్కొన్నారు. ప్రతిపక్ష పార్టీలు ఓటమి గ్రహించి దాడులకు దిగుతున్నారని వైఎస్సార్ సీపీ కార్యకర్తలు, నాయకులు సమయమనం పాటించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

### ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి



అంబాజీపేటలో మాక్ డ్రిల్ నిర్వహిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

అంబాజీపేట: వంట గ్యాస్ లీకై ప్రమాదం జరిగినప్పుడు అప్రమత్తంగా ఉండాలని అమలాపురం ఫైర్ ఆఫీసర్లు జి.శ్రీనివాస్, ఎం.బాలరవి అన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా అంబాజీపేట జెడ్పీ హైస్కూల్ ప్రాంగణంలో ఫైర్ అగ్నిమాపక అధికారులు, సిబ్బంది మాక్ డ్రిల్‌ను శనివారం నిర్వహించి అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పించారు. వంట గ్యాస్ సిలిండర్ల వాడకం విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను మహిళలకు వివరించారు. వంట గ్యాస్ సిలిండర్లు ద్వారా గ్యాస్ లీకై అగ్నిప్రమాదం సంభవిస్తే తీసుకోవాల్సిన చర్యలపై డెమో నిర్వహించారు. గ్యాస్ స్టౌపై వంటకాలు చేసే సమయంలో అతి జాగ్రత్తగా ఉండాలన్నారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా ప్రమాదం సంభవించినా లేదా ఎల్‌పీజీ వంట గ్యాస్ వాడుతున్నప్పుడు ఏదైనా ప్రమాదం జరిగితే ఏ విధంగా నిర్మూలించాలో వివరించారు. కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది, విద్యార్థులు, మహిళలు పాల్గొన్నారు.

## ఈ నెల 30 వరకూ పోలీస్ యాక్టు అమలు

- డీఎస్పీ రామకృష్ణ



రామకృష్ణ, డీఎస్పీ రామచంద్రపురం

రామచంద్రపురం: స్థానిక పోలీస్ సబ్‌డివిజన్ పరిధిలో ఈనెల 30వ తేదీ వరకూ 30 పోలీస్ యాక్టు అమలులో ఉంటుందని, ప్రతి ఒక్కరూ నిబంధలు పాటించాలని లేకుంటే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని డీఎస్పీ బి.రామకృష్ణ వెల్లడించారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ సబ్ డివిజన్ పరిధిలో రామచంద్రపురం, ద్రాక్షారామ, పామర్రు, అంగర, మండపేటటౌన్, మండపేట రూరల్, రాయవరం పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న ప్రాంతాలకు ఈ యాక్టు వర్తిస్తుందన్నారు. దీని ప్రకారం ముందస్తు అనుమతులు లేకుండా సభలు సమావేశాలు, ఊరేగింపులు నిర్వహించరాదన్నారు. అటువంటివి జరపడానికి రామచంద్రపురం డీఎస్పీ కార్యాలయంలో ముందస్తు అనుమతులు పొందాలని తెలిపారు. శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా తీసుకుంటున్న ఈ చర్యలను గమనించి ప్రతీ ఒక్కరూ సహకరించాలని డీఎస్పీ విజ్ఞప్తి చేశారు.

## ఈదురు గాలులతో వర్షం



ఈదురుగాలులు వీస్తున్న దృశ్యం

- చల్లబడిన వాతావరణం
- సేద తీరిన జనం

కె.గంగవరం: వేసవి ప్రారంభం నుంచి ఇప్పటి వరకు సూర్యుడి ప్రతాపంతో పల్లే గ్రామాలు అల్లాడుతున్నాయి. ఒక్కసారిగా శనివారం తెల్లవారు జాము నుంచి ఉదయం తొమ్మిది గంటల వరకూ ఆకాశం నల్లని మబ్బులతో ఆహ్లాదకరంగా మారింది. పచ్చని కొబ్బరిచెట్ల మీదుగా ఆకాశంలో ఏర్పడిన మబ్బులు ప్రజలను అబ్బురపరిచాయి. ఎండవేడితో సతమతమవుతున్న ప్రజలకు చల్లని గాలులతో ఆకాశం మేఘావృతం కావడంతో చిన్నారులు బయటకు వచ్చి కేరింతలు కొడుతూ చల్లదనాన్ని ఆస్వాదించారు. ఉదయం ఆకాశం మేఘావృతంగా మారి ఈదురుగాలులు, ఉరుములతో వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. సుమారు గంట సేపు ఎకదాటిగా వర్షం కురిసింది.

## అంకితభావంతో పని చేసిన వారికి గుర్తింపు



సాయిబాబును సన్మానిస్తున్న విజయరాజు

మామిడికుదురు: విధి నిర్వహణలో అంకితభావంతో పని చేసిన ఉద్యోగులకు ప్రజల్లో తగిన గుర్తింపు, గౌరవం లభిస్తాయని దేవదాయ శాఖ ఉప కమిషనర్ ఎం.విజయరాజు, అప్పనపల్లి బాలబాలాజీ దేవస్థానం ఈఓ గ్రంధి మాధవి పేర్కొన్నారు. గతంలో అప్పనపల్లి దేవస్థానం ఈఓగా పని చేసి శుక్రవారం ఉద్యోగ విరమణ పొందిన డి.సాయిబాబు సన్మాన సభ శుక్రవారం రాత్రి అప్పనపల్లి బాలబాలాజీ స్వామి ఆలయ ప్రాంగణంలో జరిగింది. సాయిబాబు దంపతులకు శాలువాలు వేసి జ్ఞాపికలు అందించి పూలమాలలతో ఘనంగా సన్మానించారు. సాయిబాబు తన హయాంలో అందించిన సేవలను మననం చేసుకున్నారు. ఉద్యోగులపై, విధులపై సాయిబాబు ఎంతో నిబద్ధతతో పని చేశారన్నారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

### బాధితుడికి ఆర్థిక సాయం

సఖినేటిపల్లి: అంతర్వేది దేవస్థానంలో అనారోగ్యంతో బాధపడుతున్న తాడి విజయ శేఖర్‌కు రూ.15 వేలను తాడి వారి ఇంటి పేరుతో సేవలందిస్తున్న సంస్థ తాడి వెల్ఫేర్ సొసైటీ శనివారం సాయం చేసింది. ఈ మేరకు విజయ శేఖర్‌కు ఇంటికి సొసైటీ సభ్యులు వెళ్లి, పై సాయం అందజేశారు. తాడి మోహన్, తాడి సహదేవ్, తాడి మోహన్ బాబు, తాడి రాజేష్, తాడి రవీంద్ర, తాడి మన్మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

# శ్రీఆంజనేయం.. ప్రసన్నాంజనేయం..

- ఘనంగా హనుమజ్జయంతి ఉత్సవాలు
- స్వామివారిని దర్శించుకున్న భక్తులు
- గ్రామాల్లో అన్నదానాలు



వాణీమహల్ ఆలయంలోని అభయాంజనేయ స్వామివారు



గొల్లపాలెంలో మామిడిపండ్లతో అభిషేకించిన భక్తులు



అంగరలో విశేషాలంకరణలో ఆంజనేయస్వామి

కాజులూరు: గొల్లపాలెం కాకినాడ, కోటిపల్లి రహదారిలో ఉన్న దాసాంజనేయస్వామివారి ఆలయంలో శనివారం హనుమాజ్జయంతిని ఘనంగా జరిగాయి. తొలుత ఆలయ ప్రధాన అర్చకులు పెదింటి కృష్ణమోహనాచార్యులు ఆధ్వర్యంలో పురోహితులు స్వామి వారిని సుంగధ ద్రవ్యాలతో అభిషేకించి, సిందూరం పూసి, ఆభరణాలతో అలంకరించారు. అనంతరం నేతి భగవాన్ ఆధ్వర్యంలో ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు స్వామివారిని తమలపాకులు, పదివేల బంగిలిపల్లి మామిడిపండ్లతో అభిషేకించి పూజలు నిర్వహించారు. భక్తులు అన్నసమారాధనలో పాల్గొన్నారు

రామచంద్రపురం రూరల్: వేగాయమ్మపేట శివారు కుందాలమ్మచెరువులో ఉన్న ప్రసన్న బాలాంజనేయస్వామి ఆలయ ప్రథమ వార్షికోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. తమలపాకు పూజ, సింధూర పూజ, అభిషేకాలు నిర్వహించారు. పెద్ద ఎత్తున అన్న ప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో ప్రసన్న బాలాంజనేయ స్వామి విగ్రహం ఏర్పాటు చేసిన దాతలు మేడిశెట్టి ధనరాజు, కనక లక్ష్మి దంపతులు, ఆలయ కమిటీ సభ్యులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

కపిలేశ్వరపురం: మండలంలోని హనుమజ్జయంతిని ఘనంగా నిర్వహించారు. కోరుమిల్లి, చిన కోరుమిల్లి, నల్లూరు గ్రామాల్లోని భారీ విగ్రహాలు వద్ద ప్రత్యేక పూజలు చేశారు. అంగర, కపిలేశ్వరపురం, టేకి గ్రామాల్లోని స్వామి విగ్రహాలు వద్ద భక్త భజన బృందం సభ్యులు భక్తి గీతాలను ఆలపించారు. స్వామివారిని అర్చకులు విశేషంగా అలంకరించారు. భక్తులు ఆలయాలను సందర్శించారు.

మండపేట: పట్టణం, మండలంలోని పలు గ్రామాల్లో హనుమజ్జయంతిని ఘనంగా నిర్వహించారు. వాణీమహల్ వద్ద 100 ఏళ్ల చరిత్ర కలిగిన అభయాంజనే స్వామి వారి ఆలయంలో విశేష పూజా కార్యక్రమాలు జరిగాయి. తమలపాకులతో అర్చనలు అందుకున్నారు. సీతారామ క్షేత్రం, రథం గుడి, ధర్మగుండం, కొండపల్లి వారి వీధి, సీతారామ కల్యాణ మండపం ప్రాంతాల్లో ఉన్న ఆంజనేయుని భారీ విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే ఏడిద, తాపేశ్వరం, ఇప్పనపాడు, కేశవరం, మెర్నిపాడు, అర్తమూరు తదితర గ్రామాల్లో వేడుకులను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పలు చోట్ల భారీ అన్న సమారాధనలు ఏర్పాటు చేశారు.

రామచంద్రపురం: పట్టణంలోని రాజగోపాల్ సెంటర్‌లో వేంచేసి ఉన్న సీతారామ భక్త వీరాంజనేయ స్వామివారి ఆలయంలో స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి, ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఏలూరి వెంకన్నబాబు పాపాజీ మాస్టర్ ఆధ్వర్యంలో హనుమాన్ చాలీసాను నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో వెంకన్నబాబు, పాపాజీ మాస్టర్ బృందాన్ని ఘనంగా సత్కరించారు. విశ్వహిందూ పరిషత్ మరియు విశ్వ చైతన్య శక్తి చారిటబుల్ ట్రస్ట్ వారి ఆధ్వర్యంలో శ్రీ పంచముఖ ఆంజనేయ స్వామి ఆలయం వద్ద పూజలు, అర్చనలు నిర్వహించారు. భక్తులకు మజ్జిగ, అన్న వితరణ కార్యక్రమాలు చేశారు. ఈ కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ జిల్లా కార్యదర్శి, అయినవల్లి రుద్రశర్మ, జిల్లా సహకార దర్శి పడాల విజయ గంగాధర్, బజరంగ్ దళ్ రామచంద్రాపురం ప్రఖండ అధ్యక్షుడు పడాల శ్రీరామ్, జనసేన నాయకులు అక్కిరెడ్డి శ్రీను, బీజేపీ నాయకులు కొట్టువాడ హరిబాబు , ట్రస్ట్ సభ్యులు చందు పాల్గొన్నారు.

## పవనపుత్రా పాహిమాం



వెదురుపాక భక్తాంజనేయస్వామి ఆలయంలో భక్తుల పూజలు

రాయవరం: పవనపుత్రా పాహిమాం..వాయుపుత్రా రక్షమాం..అంటూ భక్తుల మారుతి నామ స్మరణతో శనివారం ఆంజనేయస్వామి ఆలయాలు కిటకిటలాడాయి. మండలంలోని పలు ఆలయాల్లో భక్తాంజనేయస్వామి జయంతి ఉత్సవాన్ని భక్తులు ఘనంగా నిర్వహించారు. రాయవరంలో వేంచేసియున్న భక్తాంజనేయస్వామి ఆలయంలో స్వామి వారికి ఆలయ అర్చకులు కూరెళ్ల సూర్యనారాయణమూర్తి, శివ ఆధ్వర్యంలో నాగవల్లీ దళాలతో అర్చన, మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, సింధూరపూజ, లక్ష తులసి దళ అర్చన, హనుమత్‌హోమం, పూర్ణాహుతి నిర్వహించారు. అదేవిధంగా మాన్య సూక్త హోమాన్ని నిర్వహించారు. రాయవరం–వెదురుపాక రహదారిలో వి.సావరం సెంటర్ వద్ద ఉన్న ఆంజనేయస్వామి ఆలయంలో ఉదయం నుంచి భక్తులు స్వామి వారికి పంచామతాభిషేకాలు, పూజలు నిర్వహించారు. అదేవిధంగా లొల్ల, వెదురుపాక, సోమేశ్వరం, మాచవరం, పసలపూడి, చెల్లూరు, వెంటూరు, కూర్మాపురం గ్రామాల్లో ఆలయ కమిటీల ఆధ్వర్యంలో ఆంజనేయస్వామి జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు.

### భక్తిశ్రద్ధలతో హనుమజ్జయంతి



ద్రాక్షారామలో ప్రసన్నాంజనేయస్వామివారి ఊరేగింపు

రామచంద్రపురం రూరల్: దక్షిణ కాశీ ద్రాక్షారామ మాణిక్యాంబా సమేత భీమేశ్వర స్వామి వారి ఆలయ ప్రాంగణంలో ఉన్న ప్రసన్నాంజనేయస్వామి ఆలయం వద్ద శనివారం బాలభక్త సమాజం ఆధ్వర్యంలో హనుమజ్జయంతిని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం నుంచి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. మధ్యాహ్నం అన్నసమారాధన నిర్వహించారు. సాయంత్రం ఉష్ట వాహనంపై ద్రాక్షారామ, వెలంపాలెం ప్రధాన వీధుల్లో స్వామి వారి ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. మండలంలోని వెల్ల, దాసరిపాడు, గొల్లలచెరువు, నరసాపురపుపేట తదితర గ్రామాల్లో ప్రత్యేక పూజలు చేశారు.



ప్రత్యేక అలంకరణలో ఆంజనేయస్వామి



ప్రత్యేక అలంకరణలో ప్రసన్న బాలాంజనేయస్వామి



పారాయణ బృందాన్ని సత్కరించిన దృశ్యం



హనుమాన్ ఆలయం వద్ద భక్తుల సందడి



మజ్జిగను పంపిణీ చేస్తున్న చారిటబుల్ సంస్థ సభ్యులు